క్లుప్తంగా

కొనుగోలు కేంద్రం ప్రారంభం



బోధన్‌రూరల్(బోధన్): రైతులు ప్రభుత్వ శనగల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్, కల్దుర్కి సొసైటీ చైర్మన్ శరత్, హున్స, సాలూర సొసైటీ చైర్మన్లు రవి, అల్లె జనార్దన్‌లు అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని కల్దుర్కి, సాలూర మండలంలోని సాలూర, హున్స సొసైటీల్లో నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. క్వింటాలు శనగకు రూ.5,335లు ధర లభిస్తుందన్నారు. దళారులకు అమ్మి మోసపో వద్దని సూచించారు.

కొనసాగుతున్న దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 65వ రోజుకు చేరాయి. దీక్షలో పట్టణ ఫ్రెండ్స్ వెల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధి రామస్వామి ఆధ్వర్యంలో సభ్యులు కూర్చున్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

బోధన్‌వాసికి అవార్డు

బోధన్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర అధికార భాషా సంఘం, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ సంయుక్తంగా మాతృ భాషాభివృద్ధికి చేస్తున్న కృషి గుర్తించి ఉమ్మడి రాష్ట్రం నుంచి పలువురిని మాతృభాష సాహిత్య సేవా శిరోమణి అవార్డుకు ఎంపిక చేసింది. ఇందులో బోధన్‌కు చెందిన మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నేత ఎంఏ రజాక్‌కు అవార్డు దక్కింది. మంగళవారం విజయవాడలో మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన



ఎడపల్లి(బోధన్): మండల పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం జిల్లా వైద్య శాఖాధికారి సుదర్శనం, ఎంపీపీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. కంటి పరీక్షలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనవరిలో ప్రారంభమైన కంటివెలుగు కార్యక్రమం వంద రోజులపాటు కొనసాగుతుందని వారు అన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 4 వేల 550 మంది కంటి పరీక్షలు చేసుకున్నారని తెలిపారు.

బోధన్ పట్టణంలో..



బోధన్‌టౌన్(బోధన్): మున్సిపాలిటీ పరిధిలోని 4, 29 వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి పరిశీలించారు. ప్రజలకు కేంద్రాల్లో అందిస్తున్న చికిత్సలు, సేవలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వెంట దూప్ సింగ్, శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



పెర్కిట్(ఆర్మూర్): రోటరీ క్లబ్(ఆర్మూర్) ఆధ్వర్యంలో ఆర్మూర్ మండలంలో ఉత్తమ సేవలందిస్తున్న అధికారులకు మంగళవారం సేవా పురస్కారాలను అందజేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కాంతి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్డీవో శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై అధికారులను సేవా పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్, ఎస్‌టీవో రాములు, ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు, ఎస్‌ఎఫ్‌వో మధుసూదన్ రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజ గంగారం, ఆర్టీసీ డీఎం కవిత, ఇరిగేషన్ ఏఈ ఆలేఖ్య, వ్యవసాయ శాఖ ఏడీఈ విజయలక్ష్మీ, మహిళ ప్రాంగణం మేనేజర్ పద్మను సేవా పురస్కారాలతో ఘనంగా సన్మానించారు.

గండిని పూడ్చేదెప్పుడు..?

- పట్టించుకోని అధికారులు
- రెండు మండలాలకు నిలిచిన రాకపోకలు
- సాగుకు 140 ఎకరాల ఆయకట్టు దూరం



రెంజల్ మండలం బాగేపల్లి, నవీపేట్ మండలం రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న చెరువుకు పడిన గండి

రెంజల్(బోధన్) : అధికారుల పర్యవేక్షణ లోపం రైతులు, గ్రామస్తులకు శాపంగా మారింది. గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు రెంజల్ మండలం బాగేపల్లి, నవీపేట్ మండలం రాంపూర్ గ్రామాల మధ్యన గల బీబీ కుంట చెరువుకు భారీ గండి పడింది. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోవడం మానేశారు. బీబీకుంట కింద సుమారు 140 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు మండలాలకు చెందిన మూడు గ్రామాల రైతుల పంట పొలాలు అధికారుల నిర్లక్ష్యంతో ఈ ఏడాది సాగుకు దూరమయ్యాయి. దీనికి తోడు రెంజల్ మండలంలోని బాగేపల్లి, కూనేపల్లి గ్రామాల ప్రజలు నిత్య పనుల నిమిత్తం నవీపేట్ మండల కేంద్రానికి ఈ చెరువుకు కట్ట మీదుగా వెళ్తుంటారు. చెరువుకు గండి పడటంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. గండిని పూడ్చకపోవడంతో చెరువు ఆయకట్టు కింది రైతులు పంటల సాగుకు ముందుకు రావడంలేదు. చెరువు కట్టపై రెండు ప్రదేశాల్లో గండి పడి నెలలు గడుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడటంలేదని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

వెంటనే గండిని పూడ్చండి

బీబీకుంట కింద బాగేపల్లి, కూనేపల్లి గ్రామాల రైతులతో పాటు నవీపేట్ మండలం రాంపూర్ గ్రామాల రైతులకు చెందిన భూములు ఉన్నాయి. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. అధికారులు వెంటనే స్పందించి గండ్లను పూడ్చి వేసి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలి. –రొడ్డ లింగం, రైతు, కూనేపల్లి

రాకపోకలకు దూరమవుతోంది

నవీపేట్ మండలంలోని రాంపూర్ చెరువు కట్ట మీదుగా నిత్యం పనుల నిమిత్తం నవీపేట్ మండల కేంద్రానికి వెళ్తుంటాం. చెరువు కట్టకు రెండు దగ్గర్ల గండి పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెరువు ఆయకట్టు కింద ఈ యేడు రైతులు పంటలను సాగుచేయడంలేదు.
–సాయిబాబాగౌడ్, రైతు, బాగేపల్లి

ఉపాధి హామీ కింద పూడ్చివేయిస్తాం

ప్రస్తుతం చెరువులో నీళ్లున్నాయి. అవి తగ్గాక వేసవి కాలంలో ఉపాధి హామీ పనుల కింద పనులను చేపట్టి పూడ్చివేయిస్తాం. లేదా ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా ప్రయత్నించి గండిని పూడ్చివేస్తాం. వాటి వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందిలేదు.
–భుజేందర్, ఏఈ

పీడిత ప్రజలకు అండగా నిలుస్తాం

- న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్



సాలూరలో మాట్లాడుతున్న భాస్కర్

బోధన్: సామాజిక సందను సృష్టిస్తున్న శ్రమజీవులు, పీడిత ప్రజలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలో పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అనేక ఉద్యమాలను చేపట్టామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం వేస్తున్నాయని, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. బోధన్– నర్సి జాతీయ రహదారి విస్తరణలో సాగు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. నాయకులు పుట్ట వరదయ్య, భూమన్న, షేక్‌నజీర్, దేవదాసు, సంగెపు సాయిలు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు



కమ్మర్‌పల్లి: నర్సాపూర్‌లో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 27 ఆవులు, 48 గేదెలకు పరీక్షలు నిర్వహించి, అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు సూచించారు. 150 గొర్రెలు, 79 మేకలకు చికిత్స చేసి మందులు అందజేశారు. గర్భ కోశ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారి రాజశేఖర్‌రావు, సర్పంచ్ పెండ ప్రభాకర్, ఎంపీటీసీ సుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

భీమ్‌గల్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నాల బాల భగత్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కన్నె సురేందర్‌లు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించటం ద్వారా ప్రభుత్వం పేదవారికి అండగా నిలుస్తోందన్నారు.

విద్యార్థులకు పద్య పఠన పోటీలు

పెర్కిట్(ఆర్మూర్): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన పద్యం పాడకుండా 55 ఆవృత్తాలలో 615 పద్యాలను రాగ యుక్తంగా పాడారు. ప్రాథమికోన్నత స్థాయిలో మనోరిత, వరుణ్, సోఫియాన్, ఉన్నత స్థాయిలో భార్గవి, అశ్వజ, శరణ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య బహుమతులను అందజేశారు. అలాగే రిషిక్, సంజన, శివానీలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమ్‌గల్: దివ్యాంగులు వ్యాపారాలు చేసుకోడానికి 2022–23 ఆర్థిక సంవత్సరానికి రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. 21 నుంచి 55 ఏళ్లలోపు దివ్యాంగులు అర్హులని పేర్కొన్నారు. భీమ్‌గల మండలానికి రూ.50 వేల యూనిట్ మంజూరైందని, యూనిట్‌కు వందశాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ నెల 28 లోపు https:// tsobmms. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా భగవాన్ శ్రీకృష్ణ పల్లకీ సేవ



ప్రసంగిస్తున్న రామానంద ప్రభు

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో మంగళవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో భగవాన్ శ్రీకృష్ణ పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. మహిళల మంగళ హారతులతో వీధుల గుండా శోభాయాత్రగా సాగింది. అనంతరం భక్తులనుద్దేశించి రామానంద ప్రభు మాట్లాడుతూ.. అన్ని శాస్త్రాల సారాంశం భగవద్గీత అని అన్నారు. భగవద్గీత గ్రంథం ప్రతి ఇంట్లో ఉండాలని సూచించారు. పవిత్ర గ్రంథాన్ని అందరూ చదవాలన్నారు.



మోతెలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మోతె రాజరాజేశ్వరస్వామి జాతర

వేల్పూర్: మోతెలో రాజరాజేశ్వరస్వామి జాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. రాజరాజేశ్వరస్వామిని దర్శించుకోడానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు భారీగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రతో పాటు రథోత్సవం నిర్వహించారు.

సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్: ఆర్మూర్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఎర్ర జొన్నసాగు చేస్తున్న రైతులకు ధర దక్కకుండా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రైతు జేఏసీ నాయకులు ప్రభాకర్, అన్వేష్‌రెడ్డి, దేగాం యాదగౌడ్‌లు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో రైతు జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి రోజు రూ.4300 చొప్పున ఇదే వ్యాపారులు కొనుగోలు చేసి మరుసటి రోజే కృత్రిమంగా రూ.3 వేలకు ధర పడిపోవడాన్ని కలెక్టర్‌కు వివరించామన్నారు. 8 సంవత్సరాలు గడుస్తున్నా ఎర్రజొన్న కొనుగోలు విధివిధానాలు ఏర్పాటు చేయలేదన్నారు. పసుపు, ఎర్రజొన్నను ఎమ్మెస్పీ లిస్టులో చేర్చాలని, పసుపునకు రూ.15 వేలు, ఎర్రజొన్నకు రూ.4,500 క్వింటాల్‌కు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

బీసీ సంఘానికి నిధులు మంజూరు



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామానికి చెందిన బీసీ సంఘం అభివృద్ధికి రూ.10 లక్షల నిధులను పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మంజూరు చేశారు. మిర్దాపల్లి ఉప సర్పంచ్ సొడ మధువర్మ ఆధ్వర్యంలో బీసీ సంఘం సభ్యులు మంగళవారం హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యేను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే తక్షణమే స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీటీసీ భూమన్న, బీసీ సంఘం అధ్యక్షుడు పెంబర్తి దశరథ్, తదితరులున్నారు.

అనుమతి మేరకే నిర్మాణాలు చేపట్టాలి



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పాలకవర్గం సభ్యులు

కమ్మర్‌పల్లి: గ్రామ పంచాయతీ అనుమతి ప్రకారమే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని హాసాకొత్తూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పష్టం చేసింది. మంగళవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. జీపీ అనుమతి ప్రతం ప్రకారం ఇళ్ల నిర్మాణంలో ర్యాంపులు, మెట్ల నిర్మాణం చేపట్టాలని గృహ నిర్మాణదారులకు సూచించారు. ఈమేరకు మేస్త్రీలకు నియమ నిబంధనలు తెలియజేశారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచ్ ఏనుగు పద్మ, కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ లాంఛనాలతో చేయకపోవడం సరికాదు'



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

ఆర్మూర్‌టౌన్: బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణిస్తే ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేయకపోవడాన్ని బీజేపీ నాయకులు తప్పుపట్టారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, దళిత మోర్చా ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పులి యుగంధర్ మాట్లాడుతూ.. కేసీఆర్ దళితుల పట్ల చిన్నచూపు చూడటమే ఇందుకు నిదర్శనమన్నారు. వెంటనే కేసీఆర్ దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు ద్యాగ ఉదయ్, మీసాల రాజేశ్వర్, వేణు, విజయానంద్, విజయ్, దోండి ప్రకాష్, మురళి, తదితరులున్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నవీపేట: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కర్ లక్ష్మీనారాయణ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని చావిడి సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలో బీజేపీ పాగా వేస్తుందని జోస్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలపై మారుమూల గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లపై అలుముకున్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. పార్టీలో చేరిన పలువురికి ఈ సందర్భంగా కండువాలు కప్పి ఆహ్వానించారు. బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రావ్, శైలేష్‌కుమార్, ఆదినాథ్, ఆనంద్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతపై దాడి హేయమైన చర్య



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

బోధన్‌టౌన్(బోధన్): హన్మకొండలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు తోట పవన్‌పై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినొద్దీన్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న అక్రమాలను ప్రజలకు తెలియజేయడం తప్పా అని ప్రశ్నించారు. దాడిచేసి గాయపరచడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న కాసుల బాల్‌రాజ్

'రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ, ఎత్తొండ క్యాంపు, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్ రాజ్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని బాల్‌రాజ్ ఆరోపించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కొట్టం మనోహర్ ఉన్నారు.

సమాచారం..

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మనోహర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

మడిగెల కోసం వేలం పాట

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ప్రాంగణంలోని మడిగెలను అద్దె ఇవ్వడానికి బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీందర్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఉదయం 11 గంటలలోపు రూ.10వేల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జాతర

వేల్పూర్: మండల కేంద్రంలో బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర జరుగనుంది. జాతర కోసం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. జాతర రోజు హోమం, బలిహరణం, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం, రథోత్సవం జరుగుతుంది. అన్నదానం కూడా చేస్తారు.

పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 26న పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి సిద్దాల నాగరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్తం

■ **సీసీ రోడ్డు పనులకు భూమిపూజ**

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని బొర్రాయి గల్లీలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ శంకర్ పటేల్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ సిద్దు, వైస్ ఎంపీపీ గంగాధర్ , ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ , బీఆర్‌ఎస్ నేత ఎజాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

■ **అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు మంగళవారం జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ భూమి పూజ నిర్వహించారు. ఎంఈవో రాజేశ్వర్, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ **అంబేడ్కర్ భవన నిర్మాణ పనుల పరిశీలన**

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో నిర్మిస్తున్న అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ఎంపీపీ పస్క నర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, తదితరులు మంగళవారం పరిశీలించారు. అంబేడ్కర్ భవనాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

■ **విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక శక్తిని వెలికితీయాలి**

రుద్రూర్ (కోటగిరి): సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు చాలా బాగున్నాయని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెల్లడవుతుందని మండల విద్యాధికారి నాగనాథ్, ఎంపీడీవో మనోహర్ రెడ్డి అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ అక్షర, ఏపీవో రమణ పాల్గొన్నారు.

■ **పీఎం కిసాన్‌కు ఆధార్ తప్పనిసరి**

బాల్కొండ: పీఎం కిసాన్‌కు ఆధార్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం జలాల్‌పూర్‌లో యాసంగి సాగు, పీఎం కిసాన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ ద్వారా డబ్బులు పొందుతున్న రైతులు వెంటనే ఆధార్ ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ లింబారెడ్డిపాల్గొన్నారు.

■ **ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి**

భీమ్‌గల్: ఉపాధి హామీ కార్డు కలిగి ఉండి 2015 కంటే ముందు ఆధార్ నమోదు చేసుకున్న కూలీలు తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ఏపీవో నర్సయ్య తెలిపారు. ఆధార్ అప్‌డేట్ చేయకుంటే జాబ్ కార్డ్ ఇన్‌ఆక్టివ్ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

■ **ప్రతి ఇంటిలో మరుగు దొడ్డి నిర్మించుకోవాలి**

బాల్కొండ: ప్రతి ఇంటిలో మరుగు దొడ్డిని నిర్మించుకోవాలని బాల్కొండ జెడ్పీటీసీ దాసరి లావణ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో సంతోష్, స్థానిక సర్పంచ్ సునీత, ఏపీవో ఇందిర పాల్గొన్నారు.

■ **చందూర్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం**

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, స్థానిక సర్పంచ్ కర్లం సాయరెడ్డి, బీఆర్‌ఎస్ నేత పోచారం సురేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. శిబిరం నెల రోజుల పాటు కొనసాగుతుందని వారు చెప్పారు.